క్లుప్తంగా

స్పందన వినతులపై దృష్టి పెట్టండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ లోకనాథపిళ్లై

శ్రీరంగరాజపురం : స్పందనలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమానికి 19 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 12, శ్మశానానికి దారి 3, తయ్యూరు పంచాయతీలో ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయింపు 4 వచ్చాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పందనకు వచ్చే సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

విద్యార్థులకు టవళ్లు పంపిణీ



టవళ్లు పంపిణీ చేస్తున్న సీఐ రాజశేఖర్

నిండ్ర: మండల కేంద్రమైన నిండ్ర ప్రభుత్వ బాలుర హాస్టల్ విద్యార్థులకు సోమవారం నగరి రూరల్ సీఐ రాజశేఖర్ టవళ్లను వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో టవళ్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయం తన దృష్టికి తీసుకురావడంతో 50 మందికి టవళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎస్ఐ రవిశంకర్, వార్డన్ సురేష్ పాల్గొన్నారు.

పద్యాల పోటీలో ప్రతిభ



ప్రథమ బహుమతి అందుకుంటున్న గమ్యశ్రీ

నగరి : జిల్లాకేంద్రం చిత్తూరులో జరిగిన జన్‌భాగీదారి కార్యక్రమంలో పద్యాల పోటీల్లో నగరి మండలం, నంబాకం మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన యం.గమ్యశ్రీ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. సోమవారం ప్రతిభ చూపిన విద్యార్థిని, తెలుగు ఉపాధ్యాయురాలు వనితకుమారిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

విజయపురం (నగరి): మండలంలోని మాధవరం దళితవాడ చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆశీర్వాదం ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఇంటి వద్ద విద్యుత్ షాక్ తగిలి ఆకస్మికంగా మృతి చెందాడు. మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి సోమవారం ఆశీర్వాదం భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జాబితాను సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల

పాలసముద్రం : మండలంలోని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి జాబితాను తీసుకురావాలని ఎంపీపీ శ్యామల తెలిపారు. సోమవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం జరిగే సర్వసభ్య సమావేశానికి మండలస్థాయి అధికారులు ప్రజల సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి సర్వే చేసి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్ రాజ్ కుమార్, సూపరింటెండెంట్ విద్యావతి, పీహెచ్‌సీ కమిటీ మెంబర్ చైర్మన్ శివప్రకాష్ రాజు, మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.

తాగునీటి గుంటకు రక్షణ కల్పించండి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అగ్రహారం గ్రామస్తులు

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని అగ్రహారం గ్రామంలోని తక్కరసు తాగునీటి గుంటను కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తూ సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈశ్వరాపురం రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబర్ 230/1లో గుంట విస్తీర్ణం 1.75 ఎకరాలు ఉందన్నారు. ఈ మంచినీళ్ల గుంట నుంచే కొన్ని దశాబ్దాలుగా తాము తాగునీటిని వినియోగిస్తున్నామని తెలిపారు. గుంటలో నీళ్లు ఉండబట్టే గ్రామంలోని బోర్లలో నీటి నిల్వలు ఉన్నాయని వివరించారు. ఈ గుంటను ఇటీవల కొందరు వ్యక్తులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, వారిని నియంత్రించి గుంటను రక్షించాలని కోరారు. ఈ మేరకు స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

మత్తుకు బానిస కావద్దు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర



సదస్సుకు హాజరైన ప్రజలు

- యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర
- అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సం సందర్భంగా అవగాహన ర్యాలీలు

పుత్తూరు రూరల్: కుటుంబాలను చిన్నాభిన్నం చేసే మాదక ద్రవ్యాలకు యువత బానిస కాకూడదని పుత్తూరు సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర అన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సబ్ కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ డ్రగ్స్ కేసుల్లో విద్యార్థులు పట్టుబడుతుండడం విచారకరమన్నారు. తాత్కాలిక ఆనందం కోసం ఎంతో విలువైన జీవితాలను కోల్పోవడం ఎంతటి అవివేకమో యువత ఆలోచించాలని కోరారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు మానసిక వైకల్యం ఏర్పడుతుందని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు 10వ తరగతికి వచ్చినప్పటి నుంచే వారి నడవడికపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మాదక ద్రవ్యాల రవాణాను పూర్తిస్థాయిలో పోలీసులు అరికట్టాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి వి.గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సి.జానకి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ, న్యాయవాదులు సంజీవి, సురేష్, ప్రజలు పాల్గొన్నారు.

నగరిలో..

నగరి : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ శ్రీనివాసంతి అన్నారు. సోమవారం ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరి పట్టణంలో విద్యార్థులతో కలసి ఆమె ర్యాలీ, మానవహారం నిర్వహించారు. విద్యార్థుల చేత డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్జీఓ సంస్థలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తీవ్రంగా కృషిచేస్తోందని తెలిపా కార్యక్రమంలో జూనియర్ కళాశాల విద్యార్థులు, ఎస్ఐ, పోలీసులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డా.భాస్కర్‌రాజు మాట్లాడుతూ ప్రతి నేరానికి మూల కారణం మత్తు పదార్థాలేనని, యువత వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజా కుళ్లాయప్ప, కళాశాల జేకేసీ కోఆర్డినేటర్ నాగార్జున, పీజీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వేణుగోపాల్, ధర్మారావు, మున్వర్, సుహాసిని, లాల్ బాషా, స్వప్న, ఏఎస్ఐ లోకనాథం, ఆర్ముగం, లక్ష్మి, అలేఖ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజియులు రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్, సెబ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనంజయరెడ్డి మాట్లాడుతూ ఇండియాను డ్రగ్స్ రహిత దేశంగా మార్చాలనే సంకల్పంతో యువత ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగరాజు, ఎస్ఐ భాస్కర్, సివిల్ సీఐ చంద్రశేఖర్, అధ్యాపకులు పలువురు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం (నగరి) : మండల కేంద్రం విజయపురంలో సీఐ రాజశేఖర్ సోమవారం ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. విద్యార్థుల చేత మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

నిండ్ర: మాదక ద్రవ్యాలు నిషేధంపై పోలీసు శాఖ విద్యార్థులకు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నిండ్ర జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులచే నగరి రూరల్ సీఐ రాజశేఖర్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాన్, గుట్కా వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను, సమాజంలో కలిగే చెడు అలవాట్లు, ప్రాణాంతక రోగాలు వంటి వానిపై బానిస అయి జీవితంలో కలిగే కష్టాలను ఆయన వివరించారు. అనంతరం విద్యార్థులచే ర్యాలీ నిర్వ హించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవి శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నగరి: మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసంతి



నిండ్రలో ర్యాలీలో సీఐ రాజశేఖర్



విజయపురం: మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్

ఆకట్టుకున్న బలి బండి కూడు ఉత్సవం



బలి బండి కూడుతో భక్తులను ఆకట్టుకుంటున్న భీముని వేషధారి



పురవీధుల్లో ఊరేగుతున్న ద్రౌపదీ అమ్మవారు

కార్వేటినగరం: మండలకేంద్రంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం బలి బండి కూడు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బకాసురునికి బండి కూడు తీసుకువెళ్లి, భీముడు సంహరించే ఘట్టాన్ని హరికథా నాట్యమయూరి రెడ్డెమ్మ భక్తులకు కనులకు కట్టినట్లుగా అలరించారు. సాయంత్రం భీముని వేషధారుడు ఎడ్ల బండిపై బకాసురునికి బండి కూడు తీసుకెళ్లే ఘట్టాన్ని వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. దీంతో భారత మిట్ట జనసంద్రంగా మారింది. ఈ క్రమంలో అమ్మవారికి మొక్కుబడి ఉన్న భక్తులు కూడా ఎడ్ల బండ్లతో అలరించారు. ఈ కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలయ కమిటీ సభ్యులు వ్యవహరించారు. అంతకుముందు స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి పురవీధుల్లో మేళతాళాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్, ఆలయ కమిటీ సభ్యులు హరిబాబు, శివప్రకాష్, బాబురెడ్డి, కృష్ణయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం..

వార్షిక మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు మంగళవారం ద్రౌపదీ ధర్మరాజుల వారికి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష



జగనన్న సురక్షలో సమస్య తెలుసుకుని టికెట్ జనరేట్ చేస్తున్న సిబ్బంది



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి

నగరి: అపరిష్కృత సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. సోమవారం నగరి పట్టణం కళింమిట్ట సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వలంటీర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లకు సంబంధించి వివరాలు సేకరించారు. 32 మంది సమస్యలు ఉన్నాయంటూ వచ్చిన జగనన్న సురక్ష బృందానికి వారి సమస్యలు విన్నవించుకున్నారు. సమస్యల పరిష్కారానికి కావలసిన పత్రాలను అప్పుడే సేకరించారు. మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, డీఈ నరేష్, సచివాలయ అడ్మిన్ భాస్కర్, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

శ్రీరంగరాజపురం : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలకేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకాన్ని బాధ్యతగా అమలు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సమావేశ మందిరంలో ఎఫ్‌ఏ, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి, జేసీఎస్ కన్వీనర్ ఏకాంబరం ఆధ్వర్యంలో ఎన్జీఓ కాలనీ సచివాలయ పరిధిలోని 14, 15, 16 వార్డులకు చెందిన వలంటీర్లు, గృహసారథులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. అలాగే వడమాలపేట గ్రామ సచివాలయంలో వడమాల, వడమాలపేట, తిరుమణ్యం సచివాలయ పరిధిలోని వలంటీర్లకు, గృహసారథులకు జగనన్న సురక్ష పథకంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. మండల, సచివాలయ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ పల్లవి

శ్రీరంగరాజపురం : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఇళ్ల వద్దే ప్రభుత్వ వైద్యసేవలను అందించడానికి ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. సోమవారం ముద్దుకుప్పం సచివాలయం పరిధిలోని చౌక్కమడుగులో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులు, గర్భిణులకు డాక్టర్ పల్లవి వైద్యసేవలు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాలు, కోడిగుడ్లు, చిక్కీ, రాగి, గోధుమ, ఎండు ఖర్జూరం తదితర పౌష్టికాహారం కలిగిన వాటిని తీసుకోవాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధకశక్తితో పాటు పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, రోగాలబారిన పడిన వారు త్వరగా కోలుకుంటారని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్స్ నిరోషా, శ్రీనివాసులు, లోకేశ్వరి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే ఉన్నత విద్య



విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్న ఎంఈఓ

పాలసముద్రం : ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్నారని ప్రిన్సిపల్ వినాయకం తెలిపారు. సోమవారం పాలసముద్రం ప్రభు త్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉంటారని, అడ్మిషన్ ఫీజు తప్ప ఇతర ఫీజులు చెల్లించాల్సిన పని లేదన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలను అందించారు.

బలిజకండ్రిగ హైస్కూల్‌లో..

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని, వారి ఉజ్వల భవిష్యత్‌కు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంఈఓ గిరిజ తెలిపారు. సోమవారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం హెచ్ఎం మనోహర్ నాయుడు సమీక్షంలో పేరెంట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పదో తరగతిలో ప్రతిభ చూపిన వారికి జగనన్న ఆణిముత్యాల్లో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థినులు వాణిశ్రీకి రూ.3 వేలు, భానుశ్రీకి రూ.2 వేలు, బృందకు రూ.1000 నగదు బహుమతి అందించారు.

పరిహారం చెల్లించాకే మూసివేస్తాం

పుత్తూరు రూరల్: కార్మికులకు పరిహారం చెల్లించిన తర్వాతే చిదా స్పిన్నింగ్ మిల్లును మూసివేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు యాజమాన్యం తరపున మేనేజర్ ఆర్.మాధవన్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 167 మంది కార్మికుల్లో 143 మంది కార్మికులకు ఇప్పటికే పరిహారం చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన వారు అదనపు పరిహారం కోసం కార్మిక శాఖలో వివాదాన్ని లేవనెత్తినట్లు చెప్పారు. అయితే ఈనెల 24న కార్మిక శాఖ ప్రొసీడింగ్స్‌ను పూర్తి చేసిందని తెలిపారు. దీర్ఘకాలిక నష్టాలు వస్తున్న కారణంగా మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

చెరువులోకి చేప పిల్లలు

గంగాధరనెల్లూరు (కార్వేటినగరం) : మండలంలోని వీరకనెల్లూరు గ్రామానికి చెందిన చెరువులో సోమవారం గంబూచియా చేప పిల్లలను వైద్యసిబ్బందితో కలిసి వదలి పెట్టినట్లు సర్పంచ్ సదాశివరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేప పిల్లలను చెరువులోకి వదలడం ద్వారా దోమల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. వర్షాకాలం కావడంతో ముందస్తు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పి.శ్రీనివాసులు, ఎంపీహెచ్ఎస్ ధర్మేంద్ర, హెచ్ఏలు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి విజయకుమారిచే హరికథా కాలక్షేపం జరిగింది. రాత్రి ఆలయ ఆవరణలో పెళ్లి పందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, సుగంధపరిమళాలు వెదజల్లే మూలికలతో ముస్తాబు చేశారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా మాంగళ్యధారణ చేశారు. అనంతరం అమ్మవారిని ఊరేగించారు. పెద్దపోటు చేను గ్రామానికి చెందిన దామోదర్ రెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

కొరత లేకుండా విద్యుత్ సరఫరా



మాట్లాడుతున్న అన్నళగన్, వరదరాజు

పాలసముద్రం: విద్యుత్ అధికారులు వ్యవసాయానికి విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్నళగన్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్ సూచించారు. సోమవారం రాచపాల్యం, శ్రీకావేరిరాజుపురం సబ్‌స్టేషన్ ఆవరణలో ఏఈ వరదరాజు సమక్షంలో రైతులతో కలసి విద్యుత్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సబ్‌స్టేషన్ పరిధిలో కమిటీలు వేసుకుని రైతుల సమస్యలను తెలుసుకుని సమస్యలు పరిష్కరించాలన్న ఉద్దేశంతో కమిటీ వేసిందన్నారు. కార్యక్రమంలో ఏఓ డిల్లీప్రసాద్, ఎల్ఐ రవి, చంద్ర లైన్‌మెన్ సికామణి, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, అయ్యప్ప, గాలి మహేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

కనుల పండువగా ద్రౌపదీ దేవి కల్యాణం



ద్రౌపదీ సమేత ధర్మరాజుస్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

పాలసముద్రం : మండలంలోని కృష్ణజమ్మపురం గ్రామంలో వెలసిన ధర్మరాజుల స్వామి ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ద్రౌపదీ సమేత ధర్మరాజుస్వామి వారికి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా బెంగళూరు వాస్తవ్యులు చిట్టిబాబు, గిరిజ కొత్తదుస్తులు, పట్టువస్త్రాలు, పూజాసామగ్రిని మంగళ వాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి చేర్చారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా జరిగిన ఈ కల్యాణోత్సవంలో వైభవంగా జరిపారు. భక్తులు తమిళనాడు, కర్ణాటక, మండల పరిధిలోని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం కథకురాలు పూర్ణ భాగతారిణి, తబలా మురళీకృష్ణ, హరికథా గానం భక్తులను అలరించింది.

పాము కాటుకు ఒకరు మృతి



మృతిచెందిన మునస్వామి

శ్రీరంగరాజపురం : మండలంలోని మెదవాడ గ్రామంలో సమీపంలో ఉన్న సిద్ధమనాయుడుకు చెందిన మామిడి తోపులో కాయలు కోస్తుండగా ఎగువ ముద్దికుప్పం దళితవాడ గ్రామానికి చెందిన మొగులయ్య కుమారుడు మునస్వామి (42) చనిపోయాడు. సోమవారం అదే గ్రామానికి చెందిన 10 మంది కూలీలతో కలసి అతను సిద్ధమనాయుడుకు చెందిన మామిడి తోపులో మామిడి కాయలను కోస్తుండగా పాము కరవడంతో అతను స్పృహ తప్పి పడిపోగా తోటి కూలీలు హుటాహుటిన పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ షెక్షావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఇంటి పెద్ద దిక్కు చనిపోవడంతో వారు అనాథలు అయ్యారని వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ప్రతి గడపలో ఆనందం కనిపిస్తోంది

- ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం చంద్రబాబుకు నచ్చడం లేదు
- బాబు, పవన్‌కల్యాణ్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రజలు ఖాయం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధే రెండు కళ్లుగా ప్రతి ఇంటికీ గడప వద్దకే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందుతున్నాయని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం ఎంఎం విలాసం గ్రామ సచివాలయాల పరిధిలోని జీలావారికండ్రిగ, ఎద్దారపుకండ్రిగ, పసలవానిమిట్ట, మర్రిమాను ఇండ్లు, కేశవకుప్పం, కేశవకుప్పం ఎస్టీకాలనీ, తానాఇండ్లు గ్రామాల్లో సర్పంచ్ జ్యోతి, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని రంగాలను అభివృద్ధి చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాన్నామని తెలిపారు. గత టీడీపీ పాలనలో బడుగు, బలహీనవర్గాల వారు అట్టడుగు స్థాయిలోనే ఉండేవారన్నారు. జగనన్న సీఎం అయ్యాక వారి జీవితాల్లో వెలుగులు నింపారని, ఆ ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం ఎద్దాపరపు కండ్రిగ గ్రామస్తులు తమ గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు ఏర్పాటు చేయాలని కోరగా, స్పందించిన ఆయన వెంటనే ట్యాంకు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ధనంజయవర్మ, పవన్‌కుమార్, ఎంపీటీసీ దేశమ్మ, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, నాయకులు మాణిక్యంరెడ్డి, చందురాజు, రమేష్‌రెడ్డి, దొరస్వామి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి, ఆనందయ్య, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, కామాక్షి, మాజీ సర్పంచ్ చెంగల్రాయయాదవు, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ రవికుమార్‌రాజు, విద్యుత్ ఏడీఈ నాగరాజు ఏఈలు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తులసివనంలో గంజాయి మొక్క చంద్రబాబు..

దేశవ్యాప్తంగా మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటున్న ఆంధ్రరాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకోవడానికి చంద్రబాబు తులసివనంలో గంజాయి మొక్కలా ఉంటున్నాడని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం కేశవకుప్పంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల అభివృద్ధిని ఓర్వలేక చంద్రబాబు, పచ్చమీడియాలు రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమాలపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం ఆ రాబందులకు ఇష్టం లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు ఆయన తనయుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ సీఎం జగనన్నపై అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఎన్టీఆర్ బొమ్మను చూసి టీడీపీకి ఓటు వేశారని, చంద్రబాబును చూసికాదని గుర్తు చేశారు. ఇప్పుడు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.